

# అల్లరి చేద్దాం

## ఐస్ బకెట్

ఆదివారం.

అప్పటికే నిద్ర లేచిన నేను పేపర్.. చదివి అసంకల్పితంగా కిటికీ దగ్గరకి వెళ్ళి అందులోంచి బయటకు చూశాను. దూరంగా చేతిలో ఆంధ్రభూమి వీక్లీ పట్టుకుని మా ఇంటికొస్తూ కనిపించాడు చలపతి.



నేను ప్రస్తుతం పనిచేస్తున్న కంపెనీలో చేరి రెండు నెలలు అవుతోంది. చలపతి నా కొలీగ్. సాహిత్యాభిమాని. మేమిద్దరం కలిశామంటే సాహితీ చర్చల్లో గంటలు గంటలు గడిపేస్తాం. అడపాదడపా కథలు రాసే నేను రచయితనని ఎవరికీ..చివరికి చలపతికి కూడా తెలియదు. క్రొత్తగా అచ్చయ్యే కథతో నన్ను నేను రచయితగా పరిచయం చేసుకోవాలని నా కోరిక. ఈవారం ఆంధ్రభూమిలో నా కథ పడింది. బహుశా అది చూసుంటాడు. అందుకే మా ఇంటికొస్తున్నాడు. నా మనసు ఆనందంతో ఉత్తుంగతరంగమవుతోంది.

చలపతి ఇంట్లోకి రాగానే మా ఆవిడని మా ఇద్దరికీ టిఫిన్, కాఫీ తెమ్మని పురమాయించాను. ఎప్పట్లానే ఇద్దరం సాహితీ సముద్రంలో ఓలలాడాము. మధ్యమధ్యలో నాకు డౌటొస్తోంది. 'అసలు నా కథ చూశాడా' అని. పోనీ నేనే ఆ విషయం కదుపుదామంటే సిగ్గూ..అహం అడ్డొస్తున్నాయి. కొంతసేపు అలా మాట్లాడుకున్నాక హఠాత్తుగా.

"అన్నట్టు నేనొచ్చిన విషయం మర్చిపోయానోయ్. నేను మీ ఇంటికి రావడానికి కారణం ఈ వీక్లీ" అన్నాడు.

నా మనసులో అప్పటిదాకా వామనావతారంలో వున్న రచయిత విశ్వరూపం దాల్చబోతున్నాడు.

"ఇందులో" అని, పేజీలు తిప్పసాగాడు.

'తొందరగా చూపించరాబాబూ..నా ప్రాణాలు పోతున్నాయి' మనసులో అనుకున్నాను.

"నువ్వు రాసిన ఈ కథకి రంగుల్లో వేసిన బొమ్మ చూశావా? అద్భుతం. ఏ చిన్న డిటెయిల్ మిస్సవ్వకుండా మార్వలెస్‌గా వేశాడ్రా ఆర్టిస్ట్. అసలిది ఇల్లస్ట్రేషన్ కాదురా. పేయింటింగ్. దీన్ని జిరాక్స్‌తో ఎన్‌లార్జ్ చేయించి మా ఫ్రంట్ రూమ్‌లో గోడకి హేంగ్ చేద్దామనుకుంటున్నాను. దాంతో రూమ్ లుక్కే మారిపోతుంది. ఏవంటావు? ఒకవేళ ఈ ఆర్టిస్ట్ నీకు తెలిస్తే అతనికి నా అప్రిషియేషన్ పాస్ చెయ్యి. నీ కథా బానే వుంది. మరి నే వస్తాను" అంటూ లేచెళ్ళిపోయాడు. నా ముఖాన బక్కెట్ చల్లని నీళ్లు పోసిన అనుభూతినిచ్చి.

-పి.వి. సుబ్బారాయుడు (సికింద్రాబాద్)

# వీళ్ళనేమందాం?



## పోలీసే అడ్డదారి తొక్కితే?

అడ్డదారిలో వెళ్ళేవాళ్ళని నిలువరించి మంచిదారికి మళ్ళించాల్సిన ఓ ట్రాఫిక్ ఎస్సయ్ ఫుట్‌పాత్‌పై వాహనంతో వెళుతూ పోలీసుల పరువు తీస్తుంటే ట్రాఫిక్‌లో చిక్కుకున్న సామాన్యులు పాపం ముక్కున వేలేసుకున్నారు 'పోలీసులకి రూల్స్ వర్తించవు-మనకి మాత్రమే కాబోలు' అనుకుంటూ. ఇటీవల ఖైరతాబాద్ దగ్గర వంతెనపై కనిపించిందీ దృశ్యం.

-తటవర్తి

**దిక్కుమాలిన ట్రాఫిక్కు....**
**ప్రజల సమస్యలని పట్టించుకోని ప్రభుత్వం...**
**కేర్ చెయ్యని అధికారులు....**

ఇలా నిత్యం తిట్టుకుంటూనే ఉంటాం. కానీ ఇక్కడ కనిపించే ఫోటోల్లో సర్కస్ ఫీట్లు చేస్తున్న వాళ్ళకి మాత్రం అలా తిట్టే హక్కు లేదు. పైపెచ్చు వాళ్ళే తిట్లు తినాలి. ఇలాంటి రిస్కులు ఎప్పుడూ తీసుకోకూడదనీ, పోలీసులున్నా లేకపోయినా ట్రాఫిక్ రూల్సుని పాటిస్తామనీ కొందరైనా గట్టి నిర్ణయం తీసుకుంటారేమో అన్న చిన్న ఆశతో ఇది మొదలుపెట్టాం.మీకు కూడా ఇలాంటి దృశ్యాలు కంటపడితే ఓ ఫోటో క్లిక్ చేసి పంపవచ్చు. మీ పేరూ, మీ కెమెరా ఆ సీన్‌ని పట్టుకున్న ప్లేసూ, టైమూ కూడా ఇవ్వండి. మరీ ఒళ్ళు మండితే ఆ శాల్తీలకి బుద్ధొచ్చేలా ఓ సరదా కేప్షన్ కూడా రాయండి.

బాగున్నవాటికి బహుమతి ఉంటుంది.

మీ ఫోటోలను bhoomiaw@gmail.comకి లేదా పోస్టులోనైనా పంపవచ్చు.